నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 27 జూలై 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

ట్రాన్స్ జెండర్ల కోసం ఆర్థిక పునరావాస పథకం

ఆసిఫాబాద్ టౌన్, జూలై 26 : ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం కోసం ఆర్థిక పునరావాస పథకం అమలవుతుందని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్‌తో కలిసి ఇద్దరు ట్రాన్స్‌జెండర్లకు ఆర్థిక పునరావాస పథకం కింద రూ. 50 వేల చెక్కులను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం కోసం అర్హత గల వారికి గుర్తింపు కార్డులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి రవి కుమార్ పాల్గొన్నారు.

ఆర్థిక పునరావాస పథకం కింద చెక్కు అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

అభివృద్ధి పనులు త్వరగా పూర్తవ్వాలి

నస్పూర్, జూలై 26 : జిల్లాలో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో మండల ప్రత్యేకాధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పనులను పరిశీలించాలని, నాణ్యతా ప్రమాణాలను పరీక్షించి పూర్తి వివరాలతో నివేదికలు అందించాలని, వాటి ఆధారంగానే బిల్లులు చెల్లిస్తామన్నారు. తాగునీటి సరఫరా, ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. లీకేజీ ఉన్న గదుల్లోకి విద్యార్థులను పంపించవద్దన్నారు. ప్రత్యేకాధికారులు తమ పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలను సందర్శించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులను సమన్వయం చేసుకుంటూ పనులు చేపట్టాలని సూచించారు. వన మహోత్సవం లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

నాడు తండ్రి.. నేడు తల్లి

● అనారోగ్యంతో ఇద్దరు మృతి ● అనాథలైన కూతుళ్లు
● విరాళాలతో అంత్యక్రియలు ● మందమర్రిలో హృదయవిదారక ఘటన
● ఆర్థిక స్థోమత లేక ఆగిన పెద్ద కుమార్తె పెళ్లి ● కనీసం ఇల్లులేని దీనస్థితి
● దాతలు ఆదుకోవాలని వేడుకోలు ● ఫోన్ పే : 7670932632

మందమర్రి, జూలై 26 : నాడు అనారోగ్యంతో తండ్రి.. నేడు ప్రమాదవశాత్తు తల్లి మృతి చెందగా, పెళ్లీడుకొచ్చిన ఇద్దరు కూతుళ్ల పరిస్థితి దయనీయంగా మారింది. కనీసం తల్లి అంత్యక్రియలకు చేతిలో చిల్లిగవ్వ లేకపోగా, స్థానికులు అందించిన విరాళాలతో ఆ తంతును పూర్తి చేయాల్సి వచ్చింది. ఈ హృదయ విదారక ఘటన మందమర్రి పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని ఊరు మందమర్రి గ్రామానికి చెందిన భూనేని దూనాచారి-లక్ష్మి(40) దంపతులకు అర్చన(21), అభిలాష(17) కూతుళ్లున్నారు. పదేళ్లక్రితం భూనేని దూనాచారి అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటి నుంచి తన అన్న బైర్నేని చందు ఇంట్లో, ఇద్దరు కూతుళ్లతో కలిసి ఉంటోంది. ఆర్థిక పరిస్థితి బాగాలేక ఇద్దరు కుమార్తెలు పదో తరగతితోనే చదువు ఆపేశారు. ఆపై ముగ్గురూ కలిసి కూలీ పనులు చేస్తున్నారు. 8 నెలల క్రితం పెద్ద కూతురు అర్చన వివాహం నిశ్చయమైంది. ఆర్థిక స్థోమత లేక పెండ్లిని వాయిదా వేస్తూ వచ్చింది. ఇంతలోనే విధి వారిని పగబట్టింది. ఈ నెల 17న లక్ష్మి ఇంటి వద్ద పనులు చేస్తుండగా, ప్రమాదవశాత్తు జారి పడడంతో తలకు తీవ్ర గాయమైంది. తలలో రక్తం గడ్డ కట్టడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న కూతుళ్లకు గ్రామస్తులు, బంధువులు తోడయ్యారు. కొంత మేర విరాళాలు సేకరించి అందించడంతో లక్ష్మిని మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

మృత దేహం వద్ద రోదిస్తున్న కూతుళ్లు అర్చన, అభిలాష

మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖానకు తీసుకెళ్లగా, అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మి గురువారం రాత్రి మరణించింది. శుక్రవారం గ్రామానికి తీసుకురాగా, అంత్యక్రియలకు డబ్బులు లేకపోవడంతో స్థానికులు, బంధువులు విరాళాలు అందజేశారు. ఆపై చిన్న కూతురు అభిలాష.. అక్క అర్చనతో కలిసి తల్లికి అంత్యక్రియలు నిర్వహించింది. వారిద్దరు రోదించిన తీరు అక్కడున్న వారిని కలచి వేసింది. కనీసం ఇల్లు కూడా లేని దీన స్థితిలో ఉన్న తమను దాతలెవరైనా ఆదుకోవాలని ఆ అక్కాచెల్లెళ్లిద్దరూ వేడుకుంటున్నారు. సాయం చేయాలనుకునే వారు సెల్ నం. 7670932632కు ఫోన్ పే చేయాలని కోరుతున్నారు.

రైతుకో తీరు పరిహారం

నేషనల్ హైవే-363 భూ సేకరణలో అన్యాయం

● పక్కనున్న వారికి పరిహారం ఎక్కువ ఇచ్చి.. తమకు తక్కువ ఇచ్చారంటున్న అన్నదాతలు ● ఆర్బిట్రేషన్ చేసుకోవాలని చెప్పకుండా తిప్పించుకున్నారంటూ ఆవేదన ● ఇప్పటికైనా న్యాయం చేయాలని వేడుకోలు

"మా అమ్మ కమలాదేవి పేరు మీద బోయపల్లి శివారులో 41 గుంటలు ఉండె. ఎన్‌హెచ్-363లో పోయింది. ఆ భూమికి చదరపు మీటరుకు రూ.350 చొప్పున రూ.17 లక్షల పరిహారం ఇచ్చిన్రు. మా పక్కన ఉన్న భూమి వాళ్లకు మాత్రం చదరపు మీటరుకు రూ.1317 ఇచ్చిన్రు. ఇదెక్కడి న్యాయమని జాయింట్ కలెక్టర్‌కు దరఖాస్తు పెట్టుకున్న. అప్పుడు ఆర్బిట్రేషన్ గురించి ఎవ్వరూ చెప్పలే. మాకు తెల్వదు. ఇప్పుడు ఆర్బిట్రేషన్ పెట్టుకుంటేనే పరిహారం పెరుగుతుందంటున్నరు. అది కూడా మూడేళ్లు దాటింది.. ఇగ ఇవ్వమంటున్నరు. ఇది సరైంది కాదు. అందరిలాగే మాకు కూడా పరిహారమివ్వాలె." అంటూ తాండూరు మండలం బోయపల్లికి చెందిన దాసరి రఘు కోరుతున్నాడు. ఈయనలాగే అనేక మంది రైతులు తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

మంచిర్యాల నుంచి చంద్రాపూర్‌కు వెళ్లే నేషనల్ హైవే -363

మంచిర్యాల, జూలై 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల నుంచి మహారాష్ట్రలోని చంద్రాపూర్ వరకు నిర్మించిన నేషనల్ హైవే -363 ఇటీవలే ప్రారంభమైంది. మంచిర్యాల జిల్లా కేంద్రం నుంచి బెల్లంపల్లి, తాండూర్ మీదుగా ఆసిఫాబాద్ జిల్లాను తాకుతూ (94 కిలోమీటర్లు) వెళ్లే ఈ నేషనల్ హైవేను నాలుగు లేన్లుగా విస్తరించారు. ఈ మేరకు 2020లో భూసేకరణ చేపట్టారు. ఈక్రమంలోనే చాలా మంది రైతులు వ్యవసాయ భూములను కోల్పోయారు. అప్పటి ప్రభుత్వ ధరను అనుసరించి నష్టపరిహారం చెల్లించి భూములు సేకరించారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. నష్ట పరిహారం మనిషికో తీరు, రైతుకో తీరున చెల్లించారంటూ భూములు కోల్పోయిన రైతులు ఆరోపిస్తున్నారు. తాండూర్ మండలం బోయపల్లికి చెందిన ఓ రైతుకు చదరపు మీటరుకు రూ.350 చొప్పున చెల్లించి, ఈ రైతు పక్కనే భూమి ఉన్న మరో రైతుకు మాత్రం చదరపు మీటరుకు రూ.1317 చొప్పున చెల్లించారు. బోయపల్లి, కన్నాల, రేపల్లెవాడ గ్రామాల్లో 30 నుంచి 40 మంది రైతులకు ఎక్కువ పరిహారం ఇచ్చి, మిగిలిన వారి నోట్లో మట్టికొట్టారంటూ రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

ఎందుకు తేడా వచ్చింది..

రైతులు కోల్పోయిన భూమికి పరిహారం ఇచ్చినప్పుడు అందరికీ ఒకే తరహాలో చెల్లించాలి కదా.. ఎందుకు వ్యత్యాసాలు వచ్చాయని ఆరా తీస్తే... సరైన అవగాహన లేని కారణంగా అనేక మంది రైతులకు తక్కువ పరిహారం వచ్చి నష్టపోయినట్లు తెలిసింది. 2020లో భూ సేకరణ చేసి, రైతుల ఖాతాల్లో డబ్బులు వేశారు. రైతుల నుంచి భూమిని సేకరించేందు అప్పుడున్న జిల్లా అదనపు కలెక్టర్ నోటీసులు ఇచ్చారు. దీంతో చాలా మంది రైతులు జాయింట్ కలెక్టర్‌కు దరఖాస్తులు పెట్టుకున్నారు. మా భూములకు మార్కెట్ ధర ఎక్కువగా ఉందని, ఆ ప్రకారం పరిహారం ఇవ్వాలంటూ వినతులు సమర్పించారు. వీరిలో కొందరు రైతులు (పరిహారం ఎక్కువ తీసుకున్న వారు) కలెక్టర్‌కు ఆర్బిట్రేషన్ పెట్టుకున్నారు. దీనిపై మిగిలిన రైతులకు అవగాహన లేకపోవడంతో జాయింట్ కలెక్టర్‌కు దరఖాస్తులు చేసుకుంటూ వచ్చారు. కలెక్టర్‌కు ఆర్బిట్రేషన్ పెట్టుకున్న రైతులకు పరిహారం మూడు నుంచి నాలుగు రెట్లు ఎక్కువ వచ్చింది. మిగిలిన వారికి గవర్నమెంట్ ధరను అనుసరించి, నిబంధనల మేరకు పెంచి తక్కువ ధర కట్టించారు. దీంతో మిగిలిన రైతులు మా నుంచి దరఖాస్తులు తీసుకున్న జాయింట్ కలెక్టర్ ఒక్కసారి కూడా ఆర్బిట్రేషన్ చేసుకోవాలని చెప్పలేదంటున్నారు. ముందే చెప్పి ఉంటే మిగిలిన వారిలా తాము ఆర్బిట్రేషన్ పెట్టుకునేవారమని.. తమకు చెప్పలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగేళ్లు అయ్యాక 20న కలెక్టర్ పిలిచి మీరంతా జాయింట్ కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారని, ఆర్బిట్రేషన్ చేసుకుంటే పరిహారం ఎక్కువ వచ్చేదని, ఇప్పుడు ఏం చేయలేమని చెప్పారని బాధితులు అంటున్నారు. ఇన్ని రోజులు చెప్పకుండా... ఇప్పుడు చెప్తే ఏం చేయాలంటూ తలలు పట్టుకుంటున్నారు.

గడువు ముగిసింది..

భూ సేకరణ చేశాక.. కలెక్టర్ ఆర్బిట్రేషన్ చేసుకోడానికి గడువు ఉంటుంది. భూ సేకరణ జరిగి, రైతుల ఖాతాల్లో పరిహారం డబ్బులు పడ్డాక మూడేళ్ల 90 రోజుల్లో ఆర్బిట్రేషన్ చేసుకోవచ్చు. కానీ ఇప్పుడు ఆ సమయం లేదు. జాయింట్ కలెక్టర్‌కు దరఖాస్తులు చేసుకున్నప్పుడే చెప్పి ఉంటే ఆర్బిట్రేషన్‌కు వెళ్లే వారిమని, ఇప్పుడు ఏం చేయాలో తెలియడం లేదని రైతులు అంటున్నారు. ఈ విషయమై న్యాయవాదులను సంప్రదిస్తే డిలే ఫిటిషన్ వేసేందుకు అవకాశం ఉందంటున్నారు. కాకపోతే కచ్చితంగా న్యాయం జరుగుతుందా అంటే.. మాత్రం గ్యారంటీ ఇవ్వలేకపోతున్నారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు ఎలాగోలా న్యాయం చేయాలని కోరుతున్నారు.

గుంతలమయంగా ఎన్‌హెచ్-363

● బయటపడిన నాణ్యతా లోపాలు ● నిర్మించిన ఆరునెలలకే ప్రమాదకరంగా రహదారి
● వాహనదారులకు ఇబ్బందులు

జాతీయ రహదారిపై గుంతలు

గుంతలను పూడ్చుతున్న హైవే సిబ్బంది

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూలై 26 (నమస్తే తెలంగాణ): నాలుగు వరుసల జాతీయ రహదారి-363 గుంతలమయంగా మారింది. నిర్మించిన ఆరు నెలలకే నాణ్యతలో డొల్లతనం బయటపడింది. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షాలకే హైవేపై ఏర్పడిన గుంతలపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. అధికారుల నిర్లక్ష్యమే నాణ్యతాలోపానికి కారణమని స్థానికుల నుంచి ఆరోపణలు వస్తున్నాయి. ప్రయాణికుల ఇబ్బందులపై ఎట్టకేలకు స్పందించిన హైవే అధికారులు గుంతలు పూడ్చే పనిలో నిమగ్నమయ్యారు. రెబ్బెన మండలం రేపల్లెవాడ నుంచి వాంకిడి మండలం గోయగాం వరకు దాదాపు రూ. 1200 కోట్లతో 54 కిలోమీటర్ల వరకు నిర్మించిన నాలుగు వ రుసల జాతీయ రహదారి దాదాపు 6 నెలల క్రితమే పూర్తయింది. గంటకు 100 కిలోమీటర్ల వేగంతో వాహనాలు ప్రయాణించేలా దీన్ని నిర్మించారు. కానీ ఆరునెలల్లోనే గుంతలు పడడంతో నాణ్యతా లోపాలు బయటపడుతున్నాయి. వర్షాకాలం ప్రారంభంలోనే రహదారిపై అడుగడుగునా గుంతలు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

నిర్మించిన ఆరు నెలలకే గుంతలు..

రహదారి నిర్మాణ సమయంలోనే నాణ్యమైన మెటీరియల్‌కు బదులుగా నాసిరకం మెటీరియల్ వినియోగించి రహదారి నిర్మిస్తున్నారని స్థానికుల నుంచి ఆరోపణలు వచ్చాయి. అయినా పట్టించుకోకుండా స్థానికంగా దొరికే మొరం, మట్టి, కంకర నాసిరకమైన మెటీరియల్ వినియోగించి రహదారి నిర్మించారు. నిర్మాణం పూర్తయిన ఆరు నెలలకే ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షాలకు గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. వర్షాలతో గుంతల్లో నీరు చేరడంతో రాత్రి వేళ్లలో హైవేపై వాహనదారులు ప్రయాణించాలంటేనే భయపడాల్సిన పరిస్థితి వస్తున్నది. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు గాలికి వదిలేసిన అధికారుల కారణంగానే రహదారిపై గుంతలు పడుతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. వాహనదారులు, ప్రయాణికుల ఇబ్బందులపై ఎట్టకేలకు స్పందించిన హైవే అధికారులు ప్రస్తుతం గుంతలు పూడ్చే పనులు చేపట్టారు.

కాగజ్‌నగర్ పట్టణంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

సమస్యలు పరిష్కరించాలి

● మున్సిపల్ కార్మికుల డిమాండ్
● కాగజ్‌నగర్‌లో ధర్నా

కాగజ్‌నగర్, జూలై 26 : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు ఆందోళన బాట పట్టారు. ఈ మేరకు పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్, కార్యదర్శి సంజీవ్ మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించి నెలనెలా వేతనాలు అందించాలని కోరితే విధుల నుంచి తొలగించి కొత్తవారిని నియమించుకుంటామని, కొత్త పాలకవర్గం బెదిరింపులకు పాల్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు కార్మికులకు మూడు నెలలుగా, నాన్ మాస్టర్ రోల్ కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నెలల కొద్దీ వేతనాలు అందక, కుటుంబం గడవక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. పీఎఫ్ డబ్బులు దాదాపు రూ.2 కోట్లు పెండింగ్ ఉన్నాయని స్పష్టం చేశారు. ఆరు నెలల క్రితం ఇద్దరు కార్మికులు మృతి చెందగా, ఇప్పటికీ వారి కుటుంబాలకు బెనిఫిట్స్ అందలేదన్నారు. ఇకనైనా స్పందించకుంటే సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకుడు ముంజం ఆనంద్, సంఘం నాయకులు మల్లేశ్, రమేశ్, మధు, శేఖర్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ ప్రభుత్వ దవాఖానకు వచ్చిన రోగులు

విజృంభిస్తున్న విషజ్వరాలు

కిటకిటలాడుతున్న ప్రభుత్వ దవాఖాన

● పల్లెలో అపరిశుభ్ర వాతావరణం ● ప్రబలుతున్న వ్యాధులు

కుమ్రం భీం ఆసిఫాబాద్, జూలై 26 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. వర్షాలు కురుస్తున్న ప్రస్తుత తరుణంలో పల్లెల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొని వ్యాధులు ప్రబలుతున్నాయి. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. ఇక్కడ 30 మందికి పైగా ఇన్‌పేషెంట్లు చికిత్స పొందుతున్నారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. జిల్లాలో 63 మలేరియా, టైఫాయిడ్ ప్రభావిత గ్రామాలను అధికారులు గుర్తించారు. ఇప్పటి వరకు జిల్లాలో 195 డయేరియా, 36 టైఫాయిడ్, 8 మలేరియా, 2 డెంగీ కేసులను అధికారులు గుర్తించారు. వర్షాకాలం నేపథ్యంలో మందుస్తు చర్యలు తీసుకోకపోవడం, పారిశుధ్య కార్యక్రమాలు సరిగా నిర్వహించకపోవడంతో వ్యాధులు వ్యాపిస్తున్నాయి. మలేరియా, టైఫాయిడ్ కేసులు నమోదయ్యే గ్రామాల్లో అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. పారిశుధ్య పనులతో పాటు కలుషిత నీరు తాగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. వైద్య పరీక్షలు నిర్వహించేందుకూ సిద్ధమవుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే వైద్య సహాయం అందించేందుకు వీలులేని 91 గ్రామాలను అధికారులు గుర్తించారు. ఈ గ్రామాలకు సరైన రోడ్లు లేకపోవడం, వాగులపై వంతెనలు లేకపోవడంతో ఆ గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి ఉందని అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వ దవాఖాన వార్డులో ఇన్‌పేషెంట్లు

బురదమయమైన దారిలో అవస్థలు పడుతూ వెళ్తున్న విద్యార్థులు

పొరుపల్లి ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలకు వెళ్లే దారి అధ్వానంగా మారగా, విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారు. నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దారి మొత్తం బురదమయమై అడుగుతీసి.. అడుగువేయలేని దుస్థితి నెలకొంది. ప్రతిరోజూ మోకాళ్ల లోతు బురదలో పాఠశాలకు వెళ్లి రావాల్సి వస్తుందని పిల్లలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా రోడ్డును బాగు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధికారులను వేడుకుంటున్నారు. - కోటపల్లి, జూలై 26

లైసెన్స్ లేకుండా స్నూకర్ ఎలా నిర్వహిస్తున్నవ్?

● నిర్వాహకులపై మహిళ ఆగ్రహం ● సోషల్ మీడియాలో చక్కర్లు
● కాగజ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ● ఇద్దరి బైండోవర్

కాగజ్‌నగర్, జూలై 26 : 'లైసెన్స్ లేకుండా స్నూకర్ ఎలా నిర్వహిస్తున్నవ్. విద్యార్థులు, యువకులను బానిసలు చేసి వారి జీవితాలను ఎందుకు నాశనం చేస్తున్నవ్'.. అంటూ కాగజ్‌నగర్‌కు చెందిన రేష్మ.. స్నూకర్ నిర్వాహకులను నిలదీసిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. కాగజ్‌నగర్ మండలం బోరిగాం గ్రామ శివారులోని ప్రధాన రోడ్డు పక్కన కొందరు కొన్నేళ్లుగా స్నూకర్ నిర్వహిస్తున్నారు. రేష్మ తమ్ముడు స్నూకర్ ఆటకు బానిసై డబ్బులు పోగొట్టుకుంటుండడంతో ఆగ్రహించిన ఆమె గురువారం రాత్రి అక్కడికి వెళ్లి నిర్వాహకులను నిలదీసింది. స్నూకర్ నిర్వాహకులే అప్పులు ఇచ్చి మరీ బెట్టింగులు పెట్టిస్తున్నారని, ఓ యువకుడు అప్పులు చెల్లించేందుకు ద్విచక్ర వాహనం సైతం అమ్మాడని, ప్రధాన రోడ్డు పక్కన స్నూకర్ బెట్టింగ్ జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆ వీడియోలో ఆరోపించింది. ఈ విషయమై ఆమె శుక్రవారం సాయంత్రం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కాగజ్‌నగర్ రూరల్ ఎస్ఐ సోనియాను వివరణ కోరగా, ప్రస్తుతం స్నూకర్ ఆట నిలిపివేశామని, నిర్వాహకులు ఇర్షాద్, రహిమాన్‌అలీలను బైండోవర్ చేశామని తెలిపారు.

రాత్రి వేళలో స్నూకర్ ఆడుతున్న యువత

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679
● జన్మదిన శుభాకాంక్షలు
● పొలిటికల్
● స్వదేశాగమనం
● లీగల్ ప్రకటనలు
● క్లాసిఫైడ్స్
● పదవీ విరమణ
● ప్రారంభోత్సవం
● శ్రద్ధాంజలి
● సినిమా
● వివాహ మహోత్సవం
● షష్టిపూర్తి మహోత్సవం
మరియు
● అన్ని శుభకార్యాలు